

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:-పాఠశాల స్థాయిలోనే ఉన్నత చదువులతో పాటు, ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉండాలని సీడీపీవో నీలిమ అన్నారు. మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ గురుకుల బాలికల పాఠశాలలో లైంగిక వేధింపులు ఎదర్కోవడం, మహిళ చట్టాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పురుషులతో సమానంగా మహిళలు గౌరవించేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేస్తుందన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాన్ని నిలబెట్టాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పటిష్టంగా ఓటర్ల జాబితాలను తయారు చేయాలి

జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్ మహమ్మద్ బాబు

ప్రజాశక్తి పాడేరు:పటిష్టమైన ఓటర్ల జాబితాల తయారీతోనే నిజమైన ప్రజాస్వామ్యానికి ఆస్కారం లభిస్తుందని, అర్హులైన ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్‌గా నియమితులైన రాష్ట్ర డైరీ అభివృద్ధి ఫెడరేషన్ కోపరేటివ్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రత్యేకాధికారి అహమ్మద్ బాబు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల విధులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేయాల్సిందేనని లేకుంటే క్రమశిక్షణా చర్యలకు పాత్రులు అవుతారని స్పష్టం చేసారు. ప్రతి బూత్ స్థాయి కార్యాలయంలో వివరాలు ప్రచురించాలని ఆదేశించారు. యువ ఓటర్ల గుర్తింపు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే ఇతర జిల్లాలలో చదువుతున్న యువతను గుర్తించడానికి ఆయా కళాశాలలకు వెళ్లి ఓటరుగా నమోదు చేయాల్సిన భాధ్యత బిఎల్ఓలు చేపట్టాలన్నారు. అన్ని బూత్ లెవల్ కార్యాలయాలలో ఓటర్ల జాబితా అందుబాటులో ఉండాలన్నారు. ఓటర్ల తొలగించడంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, తిరస్కరణలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలకు ఏఈఆర్‌వోలు కూడా వెళ్ళాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా సమస్యలు తెలియజేయవచ్చని, అవసరమైతే నేరుగా తన నంబర్ 9441412121కు కాల్ చేయవచ్చని సూచించారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలో ప్రతి వెయ్యి మంది జనాభాకు 661 మంది ఓటర్లు ఉన్నారని, 283 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లలో 22 మండలాలకు 22 మంది ఏఈఆర్‌వోలు, ఏడుగురు అదనపు ఏఈఆర్‌వోలు ఉన్నారని, 1008 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు.

శాసన సభ్యులు కే.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కొన్ని గ్రామాలలో కనీసం 10 కిలోమీటర్లు కాలి నడకన వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అబ్జర్వర్ స్పందిస్తూ అటువంటి ఓటర్లను దగ్గరగా ఉన్న బూత్ కు మార్చాలని అధికారులను ఆదేశించారు.

అరకు శాసన సభ్యులు చెట్టి ఫాల్గుణ మాట్లాడుతూ, ముంచింగిపుట్టు మండలం బుంగపుట్టు పంచాయతిలో బూత్ దూరంగా ఉన్నందున గత ఎన్నికలలో ఓటింగ్ బాయ్ కట్ చేసారని తెలిపారు.

మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, బూత్ లెవల్ ఏజంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. అనంతరం సిపిఎం నేత వి.ఉమామహేశ్వరరావు, బిజెపి నేత కృష్ణారావు, రాజారావు తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ జే. శివశ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ, పాడేరు, రంపచోడవరం సబ్ కలెక్టర్లు వి. అభిషేక్, శుభం బన్సాల్, శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఓ దయానిధి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్‌బాబు



5 కె వాక్ చేపడుతున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ ఆధ్వర్యాన 5 కె వాక్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన 5కె వాక్ ర్యాలీ బుధవారం అరకులోయ ఎన్‌టిఆర్ గ్రౌండ్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ తర్వాత నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల ఆరు నెలలు గడిచినా సిపిఎస్ విధానం రద్దు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సిపీ ఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కార్యదర్శి టీ.చిట్టిబాబు, ఎం.బాబురావు, ఎస్.కన్నయ్య, పి.దేవుడు, రామ్ చందర్, రాజ్ కుమార్, మహిళా నాయకులు పార్వతమ్మ, భూలక్ష్మి, అప్పలమ్మ, సిపిఎస్ కన్వీనర్ ఎల్.నారాయణ, ఎస్.నారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు : ఆగ్రో రైతు సేవా కేంద్రాల కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎపి ఆగ్రోస్ జిల్లా మేనేజర్ డిడివి. ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరు చేసిందని, ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు రైతులకు విక్రయించాల్సి ఉంటుందన్నారు. సైన్సులో పట్టభద్రులై ఉండి స్థానికంగా ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నెంబర్లలో 9948111798, 9948098534 సంప్రదించాలని కోరారు.



ఎమ్మెల్యే ధనలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థినులు, స్థానిక మహిళలు

గిరిజన బాలికలపై లైంగిక వేధింపులు

- కాకవాడ ఆశ్రమ పాఠశాలలో దారుణం
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన బాధితులు
- విచారణకు ఐటిడిఎ పిఒ ఆదేశం

ప్రజాశక్తి-రంపచోడవరం

మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులు చోటుచేసుకున్నాయి. పాఠశాలలో హెచ్‌ఎం భర్త ప్రసాద్ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని బుధవారం పాఠశాలను సందర్శించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి బాధిత బాలికలు తెలియజేశారు. తమ సమస్యలను ఎమ్మెల్యేకు మొరపెట్టుకొని కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాల హెచ్‌ఎం భర్త ప్రసాద్ పాఠశాలలో గిరిజన బాలికల పట్ల లైంగిక పరంగా కామెంట్లు చేయడంతో పాటు స్నానాలు చేసేటప్పుడు, బట్టలు మార్చుకునే సమయంలో బాలికల బాత్రూమ్‌ల్లో చూస్తున్నారని బాలికలు తెలిపారు. పాఠశాల నిర్వహణలో ఎటువంటి అధికారం లేకపోయినా ప్రసాద్ పాఠశాలలోనే ఉంటూ విద్యార్థినులపై పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం ఆహారం పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను పాఠశాల హెచ్‌ఎం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై గ్రామస్తుల సహాయంతో ఫిర్యాదు చేశారు. దీనిపై ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే స్పందించి జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులు పాల్పడిన ప్రసాద్‌పై పోలీస్ కేసు నమోదు చేయాలన్నారు. జరిగిన సంఘటనలపై గిరిజన సంక్షేమ డిడి సిహెచ్.శ్రీనివాసరావు బుధవారం పాఠశాలలో విచారణ జరిపి ఐటిడిఎ పిఒకు నివేదించారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేదని హెచ్‌ఎంపై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి దోషాలపై కఠిన చర్యలు తీసుకోవాలని గిరిజన నాయకులు డిమాండ్ చేశారు.



ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రసాద్

గిరిజనులకు ఆధార్, ఓటు హక్కు కల్పించండి

జిల్లా కలెక్టర్‌కు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి-పాడేరు:జి.మాడుగుల మండలం గడుతూరు, సొలభం పంచాయతీ పరిధిలో వున్న బొడ్డుమామిడి గిరిజనులకు ఆధార్, ఓటు హక్కు కల్పించాలని, అంజలి శనివారం నుండి బొడ్డు మామిడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస, మండల నాయకులు పాలికి లక్కు, బొజ్జన్న తదితరులు బుధవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. డిశంబర్ 1న సిపిఎం బృందం ఈ పంచాయతీలో పర్యటించిందని, బొడ్డుమామిడి గ్రామంలో సుమారు 175 మంది కొండదొర గిరిజన తెగ ప్రజలు నివసిస్తున్నారని అప్పలర్స తెలిపారు. ఆజాదికా అమృతా మహోత్సావాలు నిర్వహిస్తున్న ఈ కాలంలో బొడ్డుమామిడి గిరిజన ప్రజలకు 76వ స్వాతంత్ర్య దినోత్సవ ఫలాలు నేటికి అందటం లేదన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామ సందర్శనకు కూడా వెళ్ల లేదని, గ్రామంలో సుమారు 60 మంది గిరిజన చిన్నారులు వుంటే గ్రామ పెద్ద ఇంటి వద్ద నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 7 మంది చిన్నారులకు మాత్రమే ప్రవేశాలు కల్పించారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మిగిలిన 53 మంది చిన్నారులకు ఆధార్ కార్డు లేకపోవడంతో బడికి దూరంగా ఉన్నారని, బడి ఈడు పిల్లలు గ్రామంలో ఆటపాటలకే పరిమితమయ్యారని వివరించారు. చిన్నారులతో పాటు పెద్ద వారికి కూడా ఆధార్ కార్డులు లేనివారు ఎక్కువమంది ఉన్నారని తెలిపారు. బొడ్డుమామిడి గ్రామంలో ఆధార్ సెంటర్ నిర్వహించి నమోదు చేయాలన్నారు. 175 మంది గిరిజన ప్రజలు వుంటే కేవలం 43 మందికి మాత్రమే ఓటు హక్కు కలిగి ఉన్నా రన్నారు. అంజలి శనివారం నుండి బొడ్డుమామిడి వరకు సుమారు 20 కిలోమీటర్లు పరిధిల్లో రహదారి లేక సుమారు 13గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ స్పందన..

బొడ్డుమామిడి గ్రామంలో ఆధార్, ఓటర్ నమోదు కోసం కనీసం 5 రోజులకు తగ్గకుండా ప్రత్యేకంగా నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, వచ్చే 15 రోజుల్లో పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని అప్పలనర్స తెలిపారు. ఉపాధిహామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు జారీ చేసిన వెంటనే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, తదితరులు



ఎత్తు కొలతలు చూస్తున్న కొయ్యూరు సిఐ స్వామినాయుడు తదతరులు

పోలీసు ఉద్యోగాల అభ్యర్థులకు పరీక్షలు

ప్రజాశక్తి-అడ్డతీగల

పోలీసు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న పలువురు గిరిజన అభ్యర్థులకు పోలీస్ శాఖ స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా సీఐ వై రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు ఆధ్వర్యంలో బుధవారం అడ్డతీగలలో రాత పరీక్ష, స్కీనింగ్ టెస్టులు నిర్వహించారు. మండలంలోని 74 మంది పురుషులు, 43 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. గిరిజన అభ్యర్థులకు ఎత్తు, శారీరక కొలతలతో పాటు రాత పరీక్ష వంటివి నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు పోలీసు ఉద్యోగాల సాధనకు త్వరలో జరగబోయే పరీక్షలకు ఐటిడిఏ సహకారంతో శిక్షణ ఇస్తామని సిఐ, ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రీనివాస్ రాంబాబు గంగాధర్ మొదలగు వారు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి సీఐ అద్దంకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎత్తు, బరువులు వంటి స్కీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న 13 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్తేడు ఎస్సై జ్వాల సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు : గిరిజన యువత జీడీ, ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు సంబంధించి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కొయ్యూరు సీఐ ఎ.స్వామినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం, కొయ్యూరు ఎస్సై రాజారావు, మంప ఎస్సై లోకేష్ కుమార్‌తో కలిసి కాకరపాడులోని గురుకుల జూనియర్ కళాశాలలో కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్కీనింగ్ టెస్ట్ నిర్వహించారు. టెస్ట్‌కు 84 మంది విద్యార్థులు హాజరయ్యారని సీఐ చెప్పారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై నిర్లక్ష్యం

- ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నేతలు ప్రభుదాస్, రాజశేఖర్

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు కే.ప్రభుదాస్, కే.రాజశేఖర్ విమర్శించారు. ఆశ్రమాల్లో ఇటీవల సంభవించిన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ ఈ నెల 9న ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేస్తున్నట్లు వారు బుధవారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిగా గోపాలకృష్ణ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఆశ్రమాల్లో సమస్యలు తిష్ట వేశాయని, గిరిజన సంక్షేమ విద్యా సంస్థలు అస్తవ్యస్తంగా మారాయని తెలిపారు.విద్యార్థులు అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారని, నాణ్యమైన విద్య అందలేదన్నారు. విద్యార్థులు మరణిస్తున్నా ఎటువంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకోలేదన్నారు. సంబంధిత ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా తప్పులను కప్పిపుచ్చుతున్నారన్నారు. విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కూడా స్పందించకపోవడం సిగ్గు చేటన్నారు. విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యం సరి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబందిత విద్యార్థి సంఘాలను విద్యా సంస్థలకు రాకుండా చేయడం దుర్మార్గమన్నారు. ఏజెన్సీలో ఇటీవల జరిగిన విద్యార్థుల మరణాలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమస్యలు ఎక్కడున్నా విద్యార్థి సంఘాలుగా ప్రశ్నించడానికి సిద్ధంగా ఉంటామని ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు చిన్నారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - చింతూరు

మండలంలోని తుమ్మల నారాయణపురం గ్రామాలలో రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన తుమ్మల సచివాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని పంచాయతీ కార్యదర్శి దేవి ప్రియకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు మొట్టం రాజయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల పేమెంట్లను 15 రోజులలో చెల్లించాలని చట్టం చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. సచివాలయ పరిధిలోని నారాయణపురం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, మరమ్మతుకు గురైన మోటర్‌ను తక్షణమే బాగు చేయించి ప్రజలకు తాగునీరు అందివ్వాలని కోరారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, వీధిలైట్లు వేయాలని, విద్యుత్ వైర్లు కిందకు ఉన్నాయని, వాటిని సరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సవలం పంతులు, మొట్టం రవికుమార్, పత్రా రాధాకృష్ణ, కోర దుర్గారావు, కురసా సుబ్బారావు, రవ్వ బుచ్చయ్య, మడకం లక్ష్మయ్య, సోడే నాగయ్య, పొడియం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి దేవి ప్రియకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

రోడ్డును పరిశీలించిన ఎపిఒ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ పరిధిలోని లింగాపురం రహదారిని కొయ్యూరు ఎపిఒ రాజు బుధవారం పరిశీలించారు. డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు కోరిక మేరకు ఈ రోడ్డును పరిశీలించిన రాజు మాట్లాడుతూ లింగపురం గ్రామానికి ఎన్‌ఆర్ఇజిఎస్ ఎర్త్ వర్క్ ద్వారా రోడ్డు పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాడి ధారలక్ష్మి, స్థానిక నాయకులు గాంధీ, కిరణ్, వాలంటీర్లు కూడా రాజు, కృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందకపోవడంపై కలెక్టర్ ఆరా

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-అనంతగిరి: పీటిజి గ్రామాల్లో కానరాని అంగన్వాడి కేంద్రం, పాఠశాల అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఈనెల 7న ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సుమిత్ కుమార్ స్పందించారు. మండల శిశు సంక్షేమ శాఖ అధికారితో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. పీటీజి లకు పౌష్టికాహారం అందక పోవడానికి కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు గుర్తించి వెంటనే ప్రతి నెలా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆ గ్రామాలలో పాఠశాల ఏర్పాటు చేయకపోవడానికి గల కారణలపై విద్యాశాఖ అధికారులు నివేదిక సమర్పించాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆ శాఖల అధికారులు పరుగులు తీశారు.

నాణ్యమైన వైద్య సేవలకు ప్రత్యేక ప్రణాళిక

ఎపి మెడికల్ కౌన్సిల్ మెంబర్ నరసింగరావు

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్రంలో నకిలీ వైద్యం అరికట్టేందుకు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందిం చినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్, లీగల్ అండ్ యాంటీ క్వాకరి చైర్మన్ డాక్టర్ తమర్భ నరసింగరావు వెల్లడించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విజయవాడ వైయస్సార్ హెల్త్ యూనివర్సిటీలో మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివరెడ్డి ఆదేశాల మేరకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించామని, ఈ మేరకు నకిలీ వైద్యం నివారణకు, నాణ్యమైన వైద్యం అందించి ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నకిలీ వైద్యులపై కూడా దృష్టి సారించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా కమిటీ కృషి చేయనుందన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ లీగల్ అండ్ యాంటీ క్వాకరి కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ వైద్యం నివారణకు చర్యలు తీసుకొనుందని తెలిపారు. మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కమిటీ కృషి చేయనుందన్నారు. వైద్య శాస్త్ర రీత్యా అర్హత పొందని వైద్యశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని నరసింగరావు వెల్లడించారు.

గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - ఎటపాక

గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ నాయకులు సోందె వీరయ్య డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పురుషోత్తపట్నంలో గిరిజనులు చేపట్టిన పోరాట శిబిరాన్ని వీరయ్య బుధవారం సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ గిరిజనులకు అండగా ఉన్న చట్టాలు, హక్కులు అమలు అమలు పరచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్ దొర, మండల కార్యదర్శి ఇరపా అజయ్, నాయకులు సొందె రామారావు, బుద్దుల భద్రయ్య, సోయం వీరమ్మ, కారం నగేష్, సీసం కొండ, భీష్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోందె వీరయ్య



శిక్షణలో పాల్గొన్న ఎంపిపి, ఎంపిడిఒ

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి మారేడుమిల్లి

గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మండలంలోని సున్నంపాడు, వేటుకూరు, పాములేరు, పుల్లంగి, మారేడుమిల్లి ఆరు పంచాయతీలకు చెందిన వారు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపిపి కుమారి సార్ల లలిత కుమారి, ఎంపీడీవో వీర కిషోర్ మాట్లాడుతూ 2023-24 ఆర్థిక వనరులను ఆర్థిక అభివృద్ధిలో నడిచే విధంగా సర్పంచ్‌లకు చెప్పడం జరిందని తెలిపారు. ట్రైనింగ్ తీసుకున్న సిబ్బందికి జిపిడిపీపై అవగాహన కార్యక్రమం పెట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆరుగురు పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సిటిజన్ రైట్స్ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- అడ్డతీగల

సిటిజన్ రైట్స్ సేవా సంఘం అల్లూరి జిల్లా జోన్ 3 నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం మండల కేంద్రంలో జరిగింది. సంఘం నూతన అధ్యక్షుడిగా అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎన్‌ఒగా చేస్తున్న గొట్టిపల్లి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, అల్లూరి జిల్లా అధ్యక్షులు శివ నాయక్, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వేముల మహేష్, రాజనగరం మండల అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఆవశ్యకతపైనా, మానవహక్కుల పరిరక్షణ కోసం ప్రజల్లో చైతన్యం కలిగించడమే ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. సంఘం తరపున ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి ఒక్కరు నిస్వార్థంగా స్వచ్ఛందంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యచంద్ర, చోడిశెట్టి సుబ్బారావు, సతీష్, శివ పాల్గొన్నారు.



అధ్యక్షునిగా ఎన్నికైన రామకృష్ణను అభినందిస్తున్న సంఘం నేతలు



మాట్లాడుతున్న జడ్‌పిటిసి సభ్యులు మత్స్యలింగం

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

ప్రజాశక్తి- హుకుంపేట: గ్రామ పంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖ అధికారులు సహకరించాలని జెడ్‌పిటిసి రేగం మత్స్య లింగం సూచించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసీలతో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై క్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి మాట్లాడుతూ, గ్రామంలో తాగునీరు, రహదారులు, సిసి రోడ్లు, విద్యుత్ తదితర సమస్యలను గుర్తించి నివేదిక పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కూడా రాజాబాబు, ఎంపిడిఓ ఆర్.వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి ఎస్.రామచంద్రరావు, ఏటిడబ్ల్యుఓ రజని, ఏఈ రమేష్ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న వైద్యులు

రగ్గులు, చీరల పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: చలి నుంచి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో గిరిజనులకు రగ్గులు, చీరలు పంపిణీ చేశామని వైద్యులు విజయ్ శేఖర్, జోగి అన్నారు. మండలంలోని గత్తుం పంచాయతీ పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు పది గ్రామాల గిరిజనులకు ప్రొఫెసర్ పిఆర్‌జె గంగారం ఆర్థిక సహాయంతో రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నపిల్లలకు గిఫ్ట్ బాక్సులు, ఆట వస్తువులు, పుస్తకాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏజెన్సీలో ప్రాంతంలో సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సేవ కార్యక్రమం ఏజెన్సీ వ్యాప్తంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాడి పోతురాజు, ఆర్గనైజింగ్ సిబ్బంది జన్ని.రాజారావు, జన్ని.బొంజుబాబు, శోభ సుందరరావు పాల్గొన్నారు

విమ్స్‌లో పిఆర్‌పి సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న రోగులకు ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా థెరపీ (పిఆర్‌పి) సెంటర్‌ను విమ్స్ హాస్పిటల్‌లో డైరెక్టర్ కె.రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం కార్పొరేట్ ఆసుపత్రికి పరిమితమైన ఈ పిఆర్‌పి చికిత్స ఇప్పుడు విమ్స్ ఆర్థోపెడిక్ విభాగంలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు ఉచితంగా చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ వర్తించని రోగులకు నామమాత్రపు రుసుముతో ఈ చికిత్సను అందిస్తామని పేర్కొన్నారు. పిఆర్‌పి చికిత్స కలిగిన తొలి ఆసుపత్రిగా రాష్ట్రంలో విమ్స్ నిలుస్తుందన్నారు. ఆర్థోపెడిక్ హెచ్‌ఒడి డాక్టర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ, పిఆర్‌పి చికిత్స ద్వారా దీర్ఘకాలిక నొప్పులు నుంచి శాశ్వత ఉపశమనం పొందవచ్చన్నారు. కొంతకాలం రోగులకు మాత్రం రెండు సార్లు ఈ చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. 60 ఏళ్ళ దాటిన వారిలో సాధారణంగా వచ్చే కీళ్ళ నొప్పులు ఈ చికిత్స ద్వారా విముక్తి పొందవచ్చన్నారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు కృషితో ఈ పిఆర్‌పి చికిత్స ఇక్కడ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు.

వైద్యాధికారులు స్థానికంగా ఉండాలి

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వైద్యాధికారులు స్థానికంగా ఉండాలని మైదాన ప్రాంతం నుండి వచ్చి వెళుతుంటామంటే ఉపేక్షించనని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ హెచ్చరించారు. బుధవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఐటిడిఎ పరిధిలోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలో యువ వైద్యాధికారులు ఉన్నారని, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. డోలీ మోతల గ్రామాల గర్భిణీలకు వైద్య సేవలు అందించడానికి గిరి గర్భిణీల వసతి గృహాలు (బర్త్ వెయింగ్ హాలు) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మాతా శిశు మరణాలు నివారించడానికి బర్త్ వెయిటింగ్ హాల్సు నిర్మించామన్నారు. ప్రసవ సమయానికి 15 రోజులు ముందుగా గర్భిణీలకు బర్త్ వెయిటింగ్ హాల్సుకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. పిహెచ్‌సిలలో ఉన్న హెచ్‌డిఎస్ నిధులను సక్రమంగా వినియోగించాలని సూచించారు. ప్రతీ నెల 3వ శుక్రవారం హెచ్‌డిఎస్ సమావేశం నిర్వహిం చాలని, సంబంధిత మీటింగ్ మినిట్స్ ఐటిడిఎకు సమర్పించాలని ఆదేశించారు. కోరుకొండ, పెదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులపై ఆరా తీసారు. మరో 15 రోజుల్లో కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తామన్నారు.
డిఎంహెచ్ఒ జమాల్ భాషా మాట్లాడుతూ, ఆసుపత్రులకు వచ్చే రోగులతో సానుకూల దృక్పదంతో ఉండి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు పింఛను అందేలా వైద్యాధికారులు బాధ్యత వహించాలని సూచించారు. ఐసిడిఎస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. మాతా శిశు మరణాలు జరిగితే వెంటనే సమాచారం అందించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎడిఎంహెచ్ఒ లీలాప్రసాద్, జిల్లా క్షయ నివారణాధికారి టి.విశ్వేశ్వరనాయుడు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ

ఉచిత శిక్షణకు రాత పరీక్ష



పెదబయలులో రాత పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణకు పోలీసుశాఖ ఆధ్వర్యాన బుధవారం రాత పరీక్షను నిర్వహించారు. ముందుగా యువతి, యువకులకు శారీరక ధారుడ్య పరీక్షలతో పాటు ఎత్తు కొలతలను నిర్వహించారు. ఎస్సై సంతోషకుమార్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు పోలీసుశాఖ ద్వారా ఉచిత శిక్షణను ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం పరీక్షకు హాజరైన అభ్యర్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో ఎస్ఐ పులి మనోజ్ కుమార్ ఆధ్వర్యాన రాత పరీక్షలు నిర్వహించారు.

అనంతగిరి: స్థానిక జూనియర్ కళాశాలలో స్థానిక ఎస్సై కె.రాము ఆధ్వర్యంలో రాత పరీక్షలను నిర్వహించారు. ఈ రాత పరీక్షకు సుమారు వందమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట: కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికకు ప్రోత్సాహం అందిస్తామని ఎస్సై బి సతీష్ అన్నారు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులకు పోలీస్ శాఖ, ఐటిడిఏ ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం, వసతి ఏర్పాటు చేస్తామన్నారు.

కాలుష్యాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 516 జాతీయ రహదారి పనులతో దుమ్ము ధూళి వెలువడటంతో ప్రయాణికులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కూడ రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా ఏజెన్సీలో కొంతకాలంగా సాగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంతో దుమ్ము లేస్తోందని పేర్కొన్నారు. రోడ్డు పనుల కారణంగా గాలిలోకి పెద్ద ఎత్తున దుమ్ము ధూళి చేరుతుందన్నారు. రహదారి పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో దుమ్ము ధూళి చేరి రహదారి గుండా వెళ్లే స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి వేస్తున్న మట్టి కంకరతో గాలిలో కాలుష్యం పెరుగుతోందని, వాహనాల రాకపోకలతో రోడ్లపై దుమ్ము ధూళితో ప్రయాణికుకు ఇబ్బంది కలగకుండా కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని లుంగపర్తి పంచాయతీ పరిధి పెద్దబయలు గ్రామం వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం డమ్ముకు నుండి పులుసుమామిడి వెళున్న ఆటో రోడ్డుపై నిలుచున్న వ్యక్తిని ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో వరబోయిన. సన్యాసి (60) మృతి చెందాడు. సాంబే రవికుమార్‌కు తీవ్రంగా గాయాలు అయ్యాయి. సన్యాసిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. గాయల పాలైన రవికుమార్ ఎస్‌కోట ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై. రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముడసర్లోవ పార్కులో కంచర్ల సినిమా సందడి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ ఆధవర్యాన ముడసర్లోవ పార్కులో బుధవారం సినిమా షూటింగ్ నిర్వహించారు. సినిమా షూటింగ్ కోసం జాతర నిర్వహించారు. రామాయణం, మహాభారతంలో పాత్రదారుల వేషధారణలు, తప్పెటగుళ్ళు, కోలాటం, ఒంటెలు, గుర్రాల ప్రదర్శన, పులి వేషాలు ఈ జాతరలో సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిత్రంలో కథానాయకుడు ఉపేంద్ర, కథానాయిక మీనాక్షితో జాతరలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇక్కడ సినిమా షూటింగ్ జరుగుతుందని వనభోజనాలు ఏర్పాటుచేయడంతో ఆరిలోవ పరిసర ప్రాంతాల నుంచి జనం రావడంతో పార్కు సందడిగా మారింది.

21 నుంచి కోర్టు ఉద్యోగాలకు పరీక్షలు

ప్రజాశక్తి-లీగల్ విలేకరి: ఏపీలోని జిల్లా కోర్టులలో ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా విశాఖపట్నం జిల్లా కోర్టులో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు డిసెంబర్ 21, 22, 23, 29, జనవరి 2 తేదీలలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తల గోపి ఒక ప్రకటనలో తెలిపారు. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, టైపిస్టు, ఫీల్డ్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఈ నెల 21, 22, 23, 29, జనవరి 2వ తేదీన, కాపీయిస్టు, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఈ నెల 26వ తేదీన, డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు ఈ నెల 26, 27, 28, 29 తేదీలలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుండి అభ్యర్థులు hc.ap.nic.in లేదా districts.ecourts.gov.in/andhrapradesh వెబ్‌సైట్ల నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ ల్యాండ్ లైన్ నెంబర్ 0863- 2372752ను సంప్రదించాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా భర్తీ ప్రక్రియ ఉంటుందని, ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి వారి మాటలు నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే వెంటనే జిల్లా కోర్టు దృష్టికి, లేకుంటే హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-విశాఖపట్నం : త్వరలో జిల్లా రిలీఫ్ ఫండ్ ఏర్పాటుచేసి దాని విధివిధానాలను ప్రకటిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా సిరిపురం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో విన్నర్స్, రన్నర్స్ 450 మందికి సర్టిఫికెట్లు, బహుమతులను కలెక్టర్ అందజేశారు. అర్హులైన 10 మంది విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల వాహనాలు, నలుగురికి లాప్ ట్యాప్‌లు, ఇద్దరికి టచ్ ఫోన్లను పంపిణీ చేశారు. స్వయం ఉపాధి పథకం కింద మరో ముగ్గురికి రూ.8 లక్షలు పంపిణీ చేశారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు తయారుచేసిన వివిధ రకాల వస్తువులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ రమణమూర్తి, డిఇఒ చంద్రకళ, బిసి వెల్ఫేర్ అధికారి శ్రీదేవి, పిఒఎస్ఎస్ఎ శ్రీనివాసరావు, ఆర్‌సిడి హస్పటల్ సూపరింటెండెంట్ విఠల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -తగరపువలస : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి వైఎస్ఆర్ కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చిట్టివలస ఫుట్ బాల్ గ్రౌండ్‌లో బుధవారం ఎంపిక పోటీలు నిర్వహించారు.



మాట్లాడుతున్న కృష్ణమోహన్

9 నుంచి విశాఖలో రోటరీ అంతర్జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 9 నుంచి 11 వరకు విశాఖలో రోటరీ అంతర్జాతీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని రోటరీ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ సిహెచ్.కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఎయు అకడమిక్ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాలకు 20 దేశాలకు చెందిన సూమారు వెయ్యి మంది విదేశీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ తొలి మహిళా అద్యక్షురాలు జెన్నిఫర్ జోన్స్ హాజరు కానున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల కార్యక్రమాలలో భాగంగా కోట్లాది రూపాయల వ్యయంతో కుట్టుమిషన్లు, వీల్‌ఛైర్లు, పొగరాని పొయ్యిలను ఆదివాసీలకు అందిస్తామన్నారు. కార్యక్రమాన్ని మాజీ భారత క్రికెటర్ పద్మభూషణ్ సునీల్ గవాస్కర్ ప్రారంభిస్తారని తెలిపారు. 11వ తేదీన ఆంధ్రవిశ్వవిద్యాలయం, రోటరీ సంస్థలు సంయుక్తంగా విశాఖ బీచ్ రోడ్‌లో విద్య, మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తూ 10కె, 5కె రన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎయు రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, రోటరీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ కోట్బాగి మాట్లాడుతూ ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కె.హరిబాబు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి.రమణ, పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా, పద్మ విభూషణ్ డాక్టర్ రఘునాథ్ మషేల్కర్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

నేడు కొండ గుడి మేరీ మాత ఉత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : ఉత్తరాంధ్ర జిల్లాల్లోని క్రైస్తవుల ఇలవేల్పుగా పేరొందిన విశాఖ పురి మేరీ మాత (అమలోద్భవి మాత) ఉత్సవాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు జరిగాయి. కొండ గుడి ఉత్సవంగా దీనిని పిలుస్తారు. ఈ ఉత్సవంలో మేరీమాతను కొలిచేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొనే వేడుకగా దీనికి పేరుంది. ఉత్సవాల్లో భాగంగా నవదిన ప్రార్థనలను నవంబర్ 29 నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు నిర్వహించి 8న మహోత్సవం జరుపుతారు. 18వ శతాబ్దం నుంచి విశాఖలో ఈ ఉత్సవాలు జరగడం విశేషం. క్రీస్తు శకం 1850లో రోజ్ అనే ఆంగ్లేయ అధికారి తన నివాసం కోసం నగరంలోని జనసంచారం లేని కొండను కొనుగోలు చేశారు. రోజ్ నుంచి కెప్టెన్ మఫెన్ దీనిని కొనుగోలు చేశారు. ఆయన నుంచి నాటి క్రైస్తవ ఆర్‌సిఎం తీసుకొని క్రీస్తు శకం 1867లో మేరీమాత ఆలయాన్ని నిర్మించి అమలోద్భవి మాత స్వరూపాన్ని అందులో ప్రతిష్ఠించారు. 1887లో గుడి వెనుక భాగంలో ప్రస్తుతం ఉన్న గుహను నిర్మించారు. ఇక్కడ ఉన్న పాత చర్చి మినహా మిగతా ప్రార్థనాలయాన్ని కూలదోసి ఫాదర్ సిరియల్ కొత్తగా చర్చి నిర్మించారు.


ప్రతి సంవత్సరం డిసెంబర్ 8న జరిగే అమలోద్భవి మాత స్వరూప ఉత్సవ తేరు ఊరేగింపు మహోత్సవానికి ప్రత్యేకత ఉంది. పాత పోస్ట్ ఆఫీస్ జంక్షన్‌లోని సెయింట్ అలోషియస్ పాఠశాల నుంచి చర్చి ప్రధాన ఆలయం వరకు ఊరేగింపు ఉంటుంది. సుమారు మూడు కిలోమీటర్ల మేర భక్తులు తమ భుజాలపై 'తేరు' మోసుకుంటూ మరియమాతను ఆలయానికి చేరుస్తారు. 1974లో భక్తులు పడవ ఆకారంలో తేరును తయారుచేసి మరియ తల్లిని ఊరేగించారు. ఇంతటి ప్రసిద్ధి చెందిన ఊరేగింపు సమయంలో భక్తుల కోసం పలు ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రధాన చర్చి సమీపంలోని ప్రత్యేక గదిలో భక్తులు మొక్కుబడిగా చర్చికి ఇచ్చిన వెండి, బంగారం ఆభరణాలను ప్రదర్శిస్తారు. బుధవారం రాత్రికే వచ్చే దూర ప్రాంతం భక్తుల కోసం ఉత్సవ కమిటీ సెయింట్ అలోసిసిస్ పాఠశాలలో ఉచితంగా విడిది ఏర్పాటు చేసింది. ఉత్సవాలకు సంబంధించి విశాఖ పురి మేరీ మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ డోల వేలాంగణిరావు మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లుగా కోవిడ్ కారణంగా మేరీ మాత స్వరూప ఉత్సవ తేరును ఊరేగించలేదని చెప్పారు. ఈ ఏడాది యధావిధిగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా వందలాది మంది ఫాదర్లు, సిస్టర్లు, బ్రదర్లు, వివిధ చర్చిలకు చెందిన భక్త సంఘాల ప్రతినిధులు సేవలు అందిస్తారని చెప్పారు

పట్టాలేకున్నా.. పట్టభద్రుల ఓటర్లే..!

ముసాయిదాలో నిరక్షరాస్యుల పేర్లు
అధికార పార్టీ ఒత్తిళ్లతో విపరీత పొరపాట్లు
సరి చేయాలంటూ పెరుగుతున్న వినతులు
అనర్హులను తొలగించాలని డిమాండ్
రేపటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ముసాయిదా ఓటర్ల జాబితాలో గతంలో ఎన్నడూలేని తప్పిదాలు ఈసారి చోటుచేసుకున్నాయి. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు అధికార పార్టీ నాయకులు లక్ష్యాలు విధించి ఓటర్ల నమోదు చేయించారు. దీంతో విద్యార్హతలు, వయస్సు పరిగణనలోకి తీసుకోకుండా నమోదు చేయడంతో విపరీతమైన తప్పులు దొర్లాయి. ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, వ్యక్తిగత దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువు ఈ నెల తొమ్మిదితో ముగియనుంది. అధికార పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగా ఒత్తిడిచేసి నమోదు చేయించిన అనర్హుల ఓటర్లను గుర్తించి, అభ్యంతరం తెలియజేసేందుకు ప్రస్తుత గడువు ఏ మాత్రమూ సరిపోయేలాలేదు. ఉమ్మడి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో 2.67 లక్షల మంది ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నమోదుచేసుకున్న వారిలో వేలాది మంది అనర్హులు, ఒకటికంటే ఎక్కువసార్లు పేర్లు నమోదైనవారు ఉన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం వారి అర్హతలను గుర్తించి అభ్యంతరాలు ఇచ్చేసరికి గడువు ముగియనుంది. మరొక్కరోజే అభ్యంతరాల స్వీకరణ గడువు వుండడంతో.. ఈ గడువులోగా అభ్యంతరాలు ఇవ్వలేకపోయినా, అధికారుల పరిశీలన సరిగాలేకపోయినా 30న విడుదల చేయనున్న తుది జాబితాలో అనర్హులు కొనసాగనున్నారు. ఇప్పటికే విశాఖపట్నం జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితాలోని లోపాలను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ, కోశాధికారి బిబి.గణేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 2,163 మంది అనర్హుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువసార్లు 8,486 మంది పేర్లు నమోదైనట్లు ఛీఫ్ ఎలక్షన్ కమిషనర్ (న్యూఢిల్లీ), రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తెలియజేశారు.



ముసాయిదా ఓటర్ల జాబితాలో నమోదైన నిరక్షరాస్యులు

అనకాపల్లి జిల్లాలో ఈ తరహా తప్పిదాలు వెలుగులోకి వస్తున్నాయి. ముసాయిదా జాబితాలో పొరపాట్లను మండల తహశీల్దార్ల దృష్టికి ప్రజా సంఘాలు తీసుకెళ్తున్నాయి. నర్సీపట్నంలో నిరక్షరాస్యులను కూడా పట్టభద్రుల ఓటర్లుగా నమోదుచేశారు. లింగాలపాలేనికి చెందిన మాకిరెడ్డి నానబాబు, మాకిరెడ్డి శారద, అన్నపురెడ్డి శాంతి చదువుకోలేనట్లు ముసాయిదా ఓటరు జాబితాలో వుంది. వీరిని కూలీలుగా నమోదు చేశారు. దోబి కాలనీకి చెందిన కోళ్లన మహిసాయి బన్నీ పేరు రెండుసార్లు, రామారావుపేట డోర్ నెంబరు 9-35-58లోని ఆనంద సుందరం పేరు నాలుగుసార్లు నమోదైంది. నర్సీపట్నం మండలంలోని వేములపూడి పంచాయతీ, అమలాపురం మెయిన్ వీధిలోని పదో తరగతి విద్యార్హత కలిగిన ఊత రమ్య పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో వుంది. పట్టభద్రుల ఓటర్ల ముసాయిదా జాబితాలోని పేర్లను పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన చిత్రవిచిత్రాలు బయటపడుతున్నాయి. ఎక్కువ మంది ఓటర్లను చేర్పించడానికి అధికార పార్టీ నాయకులు చేసిన ఒత్తిళ్లతో అనేక తప్పులుదొర్లాయి. ఈ తప్పులను గడువులోగా పరిశీలించే అవకాశం తక్కువగా వుంది. పేర్ల వారీగా పరిశీలించి అనర్హులను జాబితా నుంచి తొలగించకపోతే వేలాది మంది అర్హులుగా నమోదుకానున్నారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులను సరిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి, నర్సీపట్నం ఆర్‌డిఒకు నర్సీపట్నం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.త్రిమూర్తులు, కె.శివనారాయణరాజు లేఖ రాశారు.

మూడు రాజధానుల పేరిట మోసం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అసలు బిల్లు లేకుండానే మూడు రాజధానులు అంటూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్న వైసిపి నాయకులపై కేసులు పెట్టాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ డిమాండ్ చేశారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మంత్రులతో పాటు అనేక మంది ప్రజాప్రతినిధులు మూడు రాజధానులు అంటూ ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఈ నెల 17న తాను ఢిల్లీ వెళ్లబోతున్నానని, ఇదే విషయమై కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వాస్తవానికి గత డిసెంబర్ నెలలోనే మూడు రాజధానుల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో వెనక్కు తీసుకుందన్నారు. బిల్లులో లోపాలను సవరించి పూర్తి స్థాయి బిల్లును మళ్లీ ప్రవేశపెడతామని ప్రకటించిన ప్రభుత్వం ఇంత వరకూ బిల్లును ఎందుకు ప్రవేశ పెట్టలేకపోయిందని ప్రశ్నించారు. బిసిల కోసం ఎంతో చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో చేసిందేమీ లేదన్నారు. కీలకమైన అన్ని పదవులలోనూ ముఖ్యమంత్రి తన సామాజిక తరగతికి చెందిన వారిని నియమించారని ఆరోపించారు. ప్రాధాన్యత లేని పోస్టుల్లో బిసిలు కొనసాగుతున్నారని తెలిపారు. ప్రజావ్యతిరేక విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమంగా కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తాను మాత్రం బెదిరింపులకు భయపడనని, ప్రతి వైఫల్యాన్నీ ప్రశ్నిస్తానని చెప్పారు.



మాట్లాడుతున్న బివి.రామ్



కెజిహెచ్ పరిసరాలను పరిశీలిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

కెజిహెచ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రముఖ వైద్యశాలైన కెజిహెచ్‌కు ప్రతి రోజూ అనేక మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారని, వారికి కనీస సౌకర్యాలు అందేటట్లు వైద్య సిబ్బంది చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. బుధవారం కెజిహెచ్‌లోని ఒపి స్లిప్, కేస్ షీట్లు మంజూరు చేసే గదిని, క్యూలైన్లను, పార్కింగ్ ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేస్ షీట్లు మంజూరు చేసే గదికి మరమ్మతులు చేయాలని, అదే విధంగా రోగులు ఒపి స్లిప్‌లు పొందేందుకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రోగులతో పాటు వచ్చే వారికి కూడా మరుగుదొడ్లు ఇబ్బంది లేకుండా నిర్మించాలన్నారు. పార్కింగ్ సదుపాయాన్ని మెరుగు పర్చాలన్నారు. ఒపి గేటు ఎదురుగా ఉన్న మినీ పార్కును సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ మైథిలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం) : శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న మార్గశిర మహోత్సవంలో భాగంగా మూడో గురువారం పూజలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శిరీష తెలిపారు. గత రెండు గురువారాల్లో నిర్వహించిన ఏర్పాట్లను సమీక్షించుకొని మూడో గురువారం సందర్భంగా భక్తులు తాకిడి అధికంగా ఉండనున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేశామని, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశామని అన్నారు. వృద్ధులు, గర్భిణులు, పిల్లలు, మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం రాత్రి 12 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇఒ శిరీష, ధర్మకర్త మండలి ఛైర్‌పర్సన్ కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

8 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది మందికి జిల్లా కలెక్టర్ మల్లికార్జున బుధవారం షోకాజ్ నోటీసులు అందజేశారు. గాజువాక ప్రాంత విఆర్ఒ బత్తుల కిరణ్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఈ నెల 5న జరిగిన రోల్ అబ్జర్వర్ సమావేశానికి హాజరు కానందుకు ఈ నోటీసులు అందజేశారు. షోకాజ్ నోటీసు జారీ చేసిన వారిలో జోన్ -2, జోన్-3, జోన్-4 అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు, జోన్-4 జోనల్ కమిషనర్, జోన్-5 టిపి సెక్షన్ డిప్యూటీ సిటీ ప్లానర్, మాడుగుల మండల తహశీల్దార్, గాజువాక జోన్-4 జోనల్ కమిషనర్, పెందుర్తి ఎంపిడిఒ ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం జివిఎంసి 16వ వార్డు కెఆర్ఎం కాలనీలో ఆయన ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో రావి కృష్ణ, జి.తమ్మయ్య, బి.ఆదినారాయణ, మల్లేష్, కె.రమణ, పి.దుర్గమ్మ పాల్గొన్నారు.